సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం | 30 | ఆగస్టు | 2023



నువ్వా..? నేనా?
కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మరోసారి బయటపడింది. కీలక నేతల సమక్షంలోనే నువ్వా..నేనా? అనేలా బలప్రదర్శన జరిగింది. - 8లో▸



మూడు గంటల ప్రభుత్వమా..
వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ కావాలా.. నిరంతర విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలో నిర్ణయించుకోవాలని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33°/26°

వాతావరణం
జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: తెలుగు పండితులు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో భాషా దినోత్సవం నిర్వహించి తెలుగు అధ్యాపకులు రాజును శాలువాతో సత్కరించారు. గణపురం మండలంలోని చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉన్నతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేశారు.

జాతీయ క్రీడా దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల కళాశాల ఆవరణలో డీవైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై ధ్యాన్‌చంద్ చిత్రాపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన 22 మంది క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ పీడీ పురుషోత్తం, ఎంపీడీఓ అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: సెప్టెంబర్ 2న జరగబోయే ముందస్తు జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకుల ప్రతినిధులతో మంగళవారం వర్చువల్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకుల దగ్గర చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వినియోగదారులతో మాట్లాడి కేసులను త్వరగా, ఖర్చు లేకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో ప్రీలిటిగేషన్స్, ఎలక్ట్రిసిటీ, ఇన్సూరెన్స్, కంపౌండింగ్ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మెయింటనెన్స్ కేసులు, ఫ్యామిలీ, బ్యాంకు లోన్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

రేపు కాళేశ్వరంలో గోదావరి హారతి

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతీ పౌర్ణమి రోజున గోదావరి హారతి కార్యక్రమాన్ని దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు ఈఓ మహేష్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 గురువారం పౌర్ణమి సందర్భంగా గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రామప్పలో సైన్‌బోర్డుల ఏర్పాటు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సందర్శించే మూగ, చెవిటి వారికోసం కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రామప్పలో మంగళవారం సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. కేంద్ర పర్యాటకశాఖామాత్యులు కిషన్‌రెడ్డి ఆదేశానుసారం పైలెట్ ప్రాజెక్ట్ కింద రామప్పలో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే రామప్ప ఆలయ విశిష్టతను సైగలు, మాటల ద్వారా తెలుపుతూ బధిరులకు(మూగ, చెవిటి) అర్థమయ్యే రీతిలో వీడియో ప్లే అవుతుంది. ఇటువంటి సదుపాయం ఇప్పటివరకు ఏ ఇతర చారిత్రక కట్టడాల్లో లేదని రామప్పలో విజయవంతమైతే దేశంలోని అన్ని చారిత్రాక కట్టడాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేసేందుకు ఏఎస్ఐ కృషిచేస్తుందని పురావస్తుశాఖ అధికారి మల్లేష్ తెలిపారు.

అస్తవ్యస్తం!

- ప్రభుత్వ పాఠశాలల్లో కరువైన కనీస సౌకర్యాలు
- అసంపూర్తిగా 'మన ఊరు–మన బడి' పనులు
- పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు
- అంతంత మాత్రంగానే నిధుల మంజూరు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మల్హర్ మండలం తాడిచెర్ల జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ నిర్మాణం

కాటారం: ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తాం .. సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతాం అని నిత్యం ప్రభుత్వ పెద్దలు చెప్పుకొస్తున్న మాటలు క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఏ లోటు లేకుండా విద్యబోధన జరిగేలా చూస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులు ప్రస్తుత పరిస్థితులను చూసి తీవ్ర అసహనానికి గురవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్లు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడటం లేదు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు దాటినప్పటికీ ఇంకా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదు. గత రెండేళ్ల కిందట ప్రారంభించిన 'మన ఊరు–మన బడి' పనులు సైతం అసంపూర్తిగానే నిలిచిపోయి ఉన్నాయి. వీటికి తోడు స్కూల్ గ్రాంట్లు సకాలంలో మంజూరు కాక పాఠశాలల నిర్వాహణ భారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పడుతోంది. ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుండటంతో విద్యార్థులకు ఆశించిన స్థాయిలో విద్యాబోధన జరగడం లేదు.

అరకొర వసతులు..

ప్రభుత్వ పాఠశాలల్లో సరైన తరగతి గదులు లేకపోవడంతో 30 నుంచి 40 మంది విద్యార్థులు ఒకే గదిలో కూర్చొని తరగతులు వింటున్నారు. పలు పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆవరణలోని చెట్లు విద్యార్థులకు తరగతి గదులుగా మారుతున్నాయి. పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పలు పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు లేకపోవడంతో తరగతి గదులు రాత్రిపూట మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. క్రీడా మైదానాలు లేక విద్యార్థులకు ఆటలకు దూరమవుతున్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కూడా సరిగా లేని పాఠశాలలు అధికంగానే ఉన్నాయి.

అసంపూర్తిగా 'మన ఊరు – మన బడి' పనులు

పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాలు మెరుగుపర్చడంలో భాగంగా ప్రభుత్వం రెండేళ్ల కిందట రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో జిల్లాలో 149 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో 88 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 51 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రూ.22.68కోట్ల అభివృద్ధి పనులను మొదలు పెట్టారు. ఇప్పటి వరకు రూ.11.90 కోట్ల నిధులతో 34 పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పనులు ఆయా దశల్లో ఉండగా పలు పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. చేసిన పనులకు నిధులు మంజూరుకాకపోవడంతో పాటు, మరో కొన్ని కారణాలతో మన ఊరు–మన బడి పనులు ముందుకు సాగడం లేవు.



కాటారం మండలం చిద్నెపల్లిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

నిధుల లేమి..

పాఠశాలల నిర్వాహణకు ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరం మంజూరు చేసే స్కూల్ గ్రాంట్లు సైతం అంతంత మాత్రంగానే అందుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెప్పుకొస్తున్నారు. ఈ సారి జిల్లాలోని 1 నుంచి 30 మంది విద్యార్థులు గల 196 పాఠశాలలకు రూ.5 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థుల గల 168 పాఠశాలలకు రూ.12,500, 101 నుంచి 250 మంది విద్యార్థులు కలిగిఉన్న 32 పాఠశాలలకు రూ.25,000, 250 నుంచి 1000 మంది విద్యార్థులు ఉన్న 9 పాఠశాలలకు రూ.37,500 స్కూల్ గ్రాంట్లు నిధులు మంజూరైనట్లు అధికారులు తెలుపుతున్నారు. అరకొర నిధులు కేటాయించడం అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

జిల్లాలో పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు:	317
ప్రాథమికోన్నత పాఠశాలలు:	44
ఉన్నత పాఠశాలలు:	69
మొత్తం విద్యార్థులు:	29,164

ఉపాధ్యాయుల కొరత..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలుపుకొని 1,804 ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 1,395 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. 409 మంది ఉపాధ్యాయుల పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో సర్కారు విద్య వెనుకబడిపోతుంది. ఒక్కో ఉపాధ్యాయుడు రెండు సబ్జెక్ట్‌లు బోధించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఉపాధ్యాయులకు భారం కావడంతో పాటు విద్యార్థుల్లో ఆసక్తి తగ్గిపోతుంది. ఏదేమైన ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి పరిష్కరిస్తేనే పాఠశాలలు బలోపేతం దిశగా వెళ్లే అవకాశాలు ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాబోధన జరిగేలా చూస్తాం. పలు పాఠశాలల్లో కొన్ని సమస్యలు నెలకొన్న మాట వాస్తవమే. మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం. మన ఊరు–మన బడి పనులు సైతం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటాం.

-కిషన్‌రావు, విద్యాశాఖ జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి

పేదల సంక్షేమానికి కృషి

- ఆశీర్వదించండి సేవకుడిగా పనిచేస్తా..
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అందించే పథకాలు అందని ఇళ్లలేదని, పేదల సంక్షేమానికి పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో రూ. 5.50 కోట్ల నిధులతో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో వృద్ధులు, వికలాంగులకు పెన్షన్, రైతుబీమా, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గండ్రకు గ్రామ ప్రజలు గజమాలతో అపూర్వ స్వాగతం పలికారు. సర్పంచ్ తాటికంటి శంకర్ ఆధ్వర్యంలో గండ్ర గెలుపునకు తీర్మానం చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా కళాకారుడు,రచయిత మిట్టపల్లి సురేందర్ రచించి పాడిన రెండు పాటలను జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి చేతులమీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కల్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ మందల లావణ్య, విద్యాసాగర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్, ఉపసర్పంచ్ ఎండీ మైనుద్దీన్, నంగావత్ రాజేష్ నాయక్, జెడ్పీటీసీలు ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పుట్ట మధు

కాటారం: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా దూసుకుపోతుందని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీసీ కులవృత్తుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కులను భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడారు. ప్రజలకు నిరంతర సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. జక్కు శ్రీహర్షిణి మాట్లాడుతూ పుట్ట మధు ఎమ్మెల్యేగా గెలిస్తేనే మంథని ఎనలేని అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, ఏఎంసీ చైర్మన్ పెండ్యాల మమతమనోహర్, బీసీ సంక్షేమశాఖ అధికారిణి శైలజ, బీఆర్ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, రామిళ్ల కిరణ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నెన్నెల గట్టయ్య, లింగంపల్లి శ్రీనివాస్‌రావు, తిరుపతయ్య, ముక్తి తిరుపతి, బొడ్డు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల సంక్షేమం, వారికి రావాల్సిన బెనిఫిట్స్‌పై గని సంక్షేమ అధికారులు దృష్టి సారించాలని ఏరియా అధికార ప్రతినిధి (డీజీఎం) తుకారాం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ అధికారులు, ఓఎస్, పీఓఎలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ టైమ్ రేటెడ్ ప్రమోషన్లు, టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివకేశవరావు, రాజు, శ్యాంప్రసాద్, సంజీవరావులు పాల్గొన్నారు.

4న వాహనాల వేలం

ములుగు: జిల్లా పోలీసు శాఖ కార్యాలయం తరఫున నిరుపయోగంగా ఉన్న వాహనాలు, విడి భాగాలను వచ్చే నెల 4వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్పీ గాష్ ఆలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 4వ తేదనీ ఆధార్‌కార్డుతో జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హాజరు కావాలని సూచించారు. కమిటీకి చైర్మన్‌గా ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, నోడల్ అధికారిగా రిజర్వుర్డ్ ఇన్‌స్పెక్టర్ అడ్మిన్ సతీష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ వ్యవహరిస్తారని వివరించారు.

ఎలక్షన్ ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



మట్టిరోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

టేకుమట్ల(రేగొండ): మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలక్షన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రేగొండ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎలక్షన్ ప్రక్రియపై ఆరా తీశారు. అధికారులు సమన్వయంతో పని చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పడిన గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయంలో నిర్మాణ పనులను పర్యవేక్షించారు. త్వరలో ప్రారంభం కానున్న తహసీల్దార్ కా ర్యాలయంలో ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ సత్యనారాయణస్వామిని ఆదేశించారు.

బీరాసాగర్ రోడ్డు పరిశీలన

మహదేవపూర్: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ భవేష్‌మిశ్రా మంగళవారం పర్యటించారు. కుదురుపల్లి గ్రామం నుంచి బీరాసాగర్ వరకు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పైప్‌లైన్ వేసి తాత్కాలిక మట్టిరోడ్డు ఏర్పాటు చేయగా ఇటీవల వర్షాలకు తెగిపోయింది. దీంతో రహదారిని పరిశీలించి రోడ్డు మరమ్మతుకు కావాల్సిన ప్రణాళికను అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. టస్సార్ స్కిల్ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీడీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మిరాజయ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయంతో పూర్వవైభవం తీసుకురావాలి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ శ్రీహర్షిణి, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్: ఆర్గానిక్ వ్యవసాయంతో గ్రామాలకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని, అధికారులు అనుబంధ శాఖల అధికారులు గ్రామాల్లో పాడిపంటలతో పూర్వ వైభవాన్ని తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. రైతులు ఎక్కువగా పత్తి, మిర్చి వాణిజ్య పంటలపై ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మత్స్యకారులకు ఆర్థిక చేయూతనందించేందుకు పట్టణాల్లో చేపల ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయని వాటి నివారణ చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈఓ విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కళ్లెపు శోభ, జెడ్పీటీసీలు తిరుపతి, అధికారులు విజయభాస్కర్, సంజీవరావు, రంగారావు, అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల విచారణ!

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో మంగళవారం సింగరేణి విజిలెన్స్ అధికారులు కార్మిక సంఘాల నాయకులను విచారించినట్లు తెలిసింది. ఏరియాలో సింగరేణి కారుణ్య నియామకాల్లో కార్మికుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. దీంతో వివిధ కార్మిక సంఘాల నాయకులను సింగరేణి గెస్ట్‌హౌస్‌కు పిలుచుకొని విచారించారు. వారి బ్యాంకు ఖాతాల వివరాలను ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అధికారులను కూడా విచారించారని చర్చించుకుంటున్నారు. సింగరేణి విజిలెన్స్ అధికారుల విచారణతో పలువురు ఆందోళన చెందుతున్నారు.

ధర్నాల జోరు..నిరసనల హోరు

- కలెక్టరేట్ ప్రాంతంలో పలు సంఘాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలు చేస్తున్న ఏఎన్ఎంలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు, సీఐటీయూ నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: టెంట్లు.. షామియానాలతో కలెక్టరేట్ ప్రాంతం నిండిపోయింది. తమ డిమాండ్లు నెరవేర్చాలని పలువర్గాల ధర్నాలకు దిగగా.. ప్రభుత్వంపై నిరసనల హోరు వినిపించారు. సమస్యలు పరిష్కరించాలని.. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఆందోళనలు నిర్వహించారు. మంగళవారం ధర్నాలతో భూపాలపల్లి కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లగా.. మద్దతు తెలిపేందుకు పలు పార్టీలు, సంఘాల నాయకులు ముందుకు వచ్చారు.

రెండో ఏఎన్ఎంల ఆందోళన

రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 15 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపడుతున్నారు. 20 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులు

విద్యాశాఖలో పని చేస్తున్న 'సమగ్ర శిక్షా ' ఉద్యోగుల జేఏసీ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ టీడీపీ జిల్లా అధ్యక్షుడు మోకిరాల జనార్దన్ రావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్‌లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. గత 16 సంవత్సరాలుగా విద్యాశాఖ విభాగమైన సమగ్ర శిక్షలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ విధానంలో చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ వస్తే మా బతుకులు బాగుపడతాయని తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ చురుకుగ్గా పాల్గొని తెలంగాణ సాధించుకుంటే వారి జీవితాల్లో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వసంతలక్ష్మి, వేణు, చాంద్‌పాషా, రాజయ్య, వెంకన్న, శ్రీనివాస్, ప్రవంతిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట

రాష్ట్రంలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లాలోని ఆశవర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో 32 ఏళ్లు, మైదాన ప్రాంతంలో 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నామని, ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందినట్లు తెలిపారు. సర్వేలు చేయడం, ప్రభుత్వ సరఫరా చేసే మందులను ప్రజలకు అందజేయడం, ప్రజారోగ్యంపై జాగ్రత్తలను తెలపడం, గర్భిణులు, చిన్నపిల్లలకు సేవలందించడంలాంటి అనేక పనులు చేస్తున్నా.. కేవలం రూ.9,750 పారితోషికం ఇవ్వడం సరికాదన్నారు. నెలకు రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశలు హాయిరెడ్డి తిరుమల, రాధిక, రాజేశ్వరి, జయప్రద, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎరియర్స్, లాభాల వాటా చెల్లించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు రావాల్సిన 11వ వేజ్‌బోర్డు ఎరియర్స్, గత ఆర్థిక సంవత్సరం లాభాల వాటాను యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జీఎం కార్యాలయంలోని అధికార ప్రతినిధి తుకారాంకు బీఎంఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికులకు రావాల్సిన 23 నెలల ఎరియర్స్, లాభాల వాటా చెల్లించాలన్నారు. బ్రాంచీ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, సుజేందర్, మల్లేష్, నరసింహారావు, మొగిలి, శంకర్‌లు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు తప్పనిసరి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



నమోదుపై వివరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు వద్ద సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వన్ ఓట్ ఫర్ ష్యూర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఫాం –6 ద్వారా ఓటు నమోదు, ఫాం –7 ద్వారా చనిపోయిన ఓట్ల తొలగింపు, ఫాం –8 ద్వారా ఎపిక్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని వివరించారు. అనంతరం ప్రజలతో కలిసి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్, సీఈఓ ప్రసూన రాణి, డిడబ్ల్యూఓ ప్రేమలత, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీసీఓ సర్దార్ సింగ్, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


శోభ మృతదేహం

బచ్చన్నపేట : రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బచ్చన్నపేట మండలం బండనాగారానికి చెందిన బరాబరి శ్రీనివాస్, శోభ(40) దంపతులు కొంత కాలంగా బీబీనగర్‌లో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి కుటుంబీకులతో కలిసి శుభకార్యానికి హాజరై వస్తున్నారు. రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఢీకొనగా శోభ తీవ్రంగా గాయపడింది. దీంతో క్షతగాత్రురాలిని వెంటనే హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అనంతరం మృతదేహాన్ని బండనాగారం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

దామెర : భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత (బాలిక) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని కోగిల్వాయిలో జరిగింది. గ్రామానికి చెందిన గాజు నాగరాజు పెద్ద కూతురును రెండు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన పెరుగు రాజు తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి బాలిక అంటే తనకు ఇష్టం లేదంటూ వేధింపులకు దిగాడు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పి బాలికను రాజు ఇంటికి పంపించారు. ఇదిలా ఉండగా రాజు సోమవారం మరో మహిళతో సన్నిహితంగా ఉండడం బాలిక గమనించింది. దీంతో భర్తతో గొడవపడి సాయంత్రం ఇంటికి వచ్చింది. అనంతరం మనస్తాపం చెందిన బాలిక.. మంగళవారం ఓ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక కోసం బంధువులు వెతకగా బావిలో మృతిచెంది కనిపించింది. మృతురాలి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల రూరల్ సీఐ మల్లేశ్ తెలిపారు.

రెడ్డి చికెన్ సెంటర్
శివనగర్, హన్మకొండ
Cell: 9989299661

నువ్వా..? నేనా..?

కాంగ్రెస్‌లో మరోసారి బయటపడిన వర్గపోరు
- వర్ధన్నపేటలో నమిండ్ల శ్రీనివాస్, మాజీ ఐపీఎస్ నాగరాజు బలప్రదర్శన
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో రచ్చరచ్చ


వేదికపై నేతలతో వాగ్వాదం చేస్తున్న కార్యకర్తలు

వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మరోసారి బయటపడింది. కీలక నేతల సమక్షంలోనే నువ్వా..నేనా అనేలా బలప్రదర్శన జరిగింది. దీంతో నేతల నుంచి.. కార్యకర్తల వరకు నిరుత్సాహానికి గురయ్యారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని లక్ష్మి గార్డెన్స్‌లో పార్టీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యుడు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దాల్వి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, వరంగల్ ఉమ్మడి జిల్లా కీలక నేతలు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే పార్టీలో ఆధిపత్య పోరు బయటపడింది. వేదికపై పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ఆశీనులయ్యారు. ఈ క్రమంలో మాజీ ఐపీఎస్, కాంగ్రెస్ నేత కేఆర్ నాగరాజు.. కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి వేదికపైకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నమిండ్ల వర్గం నాగరాజును వేదికపైకి రాకుండా అడ్డుకుంది. దీంతో ఇరువర్గాల నేతలు తమ నాయకత్వాలకు అనుకూలంగా నినాదాలు చేయగా తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి సుమారు అరగంట పాటు ఉద్రిక్తంగా మారింది. వేదికపై ఉన్న నేతలు కలుగజేసుకుని ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరూ వేదికపైకి రావాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది.

బలప్రదర్శన వేదికగా..

కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సమీక్ష సమావేశానికి నమిండ్ల శ్రీనివాస్, కెఆర్ నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలను భారీ సంఖ్యలో రప్పించారు. వేదికపై ఎవరికి వారు తమ బల ప్రదర్శన నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కాగా, మంగళవారం నిర్వహించిన సమావేశానికి అధికంగా కార్యకర్తలు అధికంగా తరలిరావడంతో కాంగ్రెస్ నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు.

నాయకులే మోసం చేస్తున్నారు..

నాయకుల తప్పిదాలతోనే కాంగ్రెస్ ఓడిపోతుందని, వచ్చే ఎన్నికల్లో కూడా గెలుపోటములకు వారిదే బాధ్యతని కీలక నేతలు హెచ్చరించారు. కాగా, గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా వర్ధన్నపేట స్థానాన్ని టీజేఎస్‌కు కేటాయించగా కాంగ్రెస్ నాయకులే మద్దతు ఇవ్వలేదని, బీఆర్‌ఎస్‌కు సహకరించారని కార్యకర్తలు గుసగుసలాడుకోవడం కనిపించింది.

నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్

- ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి
- ఘన్‌పూర్‌లో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ సమావేశం


మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు నిరంకుశ, అవినీతి పాలన సాగిస్తున్నాయని ఏఐసీసీ అబ్జర్వర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి అన్నారు. స్థానిక ఈఆర్‌ఎల్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి హాజరై మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరికి అవకాశం ఇచ్చినా అందరూ ఐక్యంగా పనిచేయాలని, గ్రూపులను ప్రోత్సహించవద్దని సూచించారు. మన లక్ష్యం బీఆర్‌ఎస్‌ను ఓడించడమేనన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆశలు పెట్టి మోసం చేయడంలో సీఎం కేసీఆర్ లాంటి ఘనుడు ఎవరూ లేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో అవినీతికి అడ్డు లేకుండా పోయిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, ఉమ్మడి వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ వెనుక తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేత కడియం శ్రీహరి గతంలో నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. మళ్లీ అవకాశం ఇస్తే తన మార్కు అభివృద్ధి చేస్తానని అంటుడడం శోచనీయమన్నారు.న్నారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, పార్టీ జనగామ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శోభారాణి, కూచన రవళి, పార్టీ నాయకులు వరద రాజేశ్వరరావు, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ, చేపూరి వినోద్, గంగారపు అమతరావు,డాక్టర్ రాజమౌళి, చేపూరి చిరంజీవి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
2 & 3 BHK Luxury Flats for Sale
Behind Circuit House & Vikas Nagar
Road No. 11 Loan Facility Available.
Cell: 7382332244

New రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలతో
GAT Mamta™ EDIBLE OILS
GARG AGROTECH
Plot No. 21, 22 (Part), IDA Rampur, Madikonda, Dist. Warangal.
email: gargrotechwgl@gmail.com

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
DHANALAXMI INDUSTRIES
IDA, RAMPUR, WARANGAL

ఇందిర వర్సెస్ సాంబయ్య

- ఏఐసీసీ అబ్జర్వర్ ముందే ఇరువర్గీయుల బాహాబాహీ


స్టేషన్‌ఘన్‌పూర్‌లో తోపులాడుకుంటున్న ఇందిర, సాంబయ్య వర్గీయులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గ విబేధాలు మరోసారి బయటపడ్డాయి. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఘన్‌పూర్ నియోజకర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య వర్గీయులు ఏఐసీసీ అబ్జర్వర్ ముందే బాహాబాహీకి దిగారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక ఈఆర్‌ఎల్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అబ్జర్వర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావ్ దళ్వి హాజరయ్యారు. సమావేశంలో ముందుగా సింగపురం ఇందిర మాట్లాడారు. అనంతరం దొమ్మాటి సాంబయ్య మాట్లాడుతుండగా ఇందిర వర్గీయులు.. ఇందిర నాయకత్వం వర్ధిల్లాలి, జై కాంగ్రెస్, జై ఇందిర అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సాంబయ్య వర్గీయులు సైతం జై సాంబన్న, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేపట్టారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి అబ్జర్వర్ ఎదుటే ఇరు వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఇతర నేతలు వారికి నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

5న కాటారంలో జాబ్‌మేళా

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సెప్టెంబర్ 5వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు గిరిజన యువత జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లను తమ వెంట తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490341911, 8008932159 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇక.. ఈ నంబర్ల నుంచే అందుబాటులోకి..

- ఆబ్కారీ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు
- కేటాయించిన ఎక్సైజ్ శాఖ

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆ శాఖ మంగళవారం నూతన ఫోన్ నంబర్లను కేటాయించింది. గతంలో బీఎస్‌ఎన్‌ఎల్‌లో కొనసాగగా.. ప్రస్తుతం ఎయిర్‌టెల్ కంపెనీ సిమ్‌లు అందజేసింది. డిప్యూటీ కమిషనర్ నుంచి.. సీఐ స్థాయి వరకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నూతన సెల్‌ఫోన్ నంబర్లతో ఎక్సైజ్ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. అదే విధంగా జిల్లాలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్లను ఇక నుంచి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులుగా(డీపీఈవో) మార్చారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు ..

డిప్యూటీ కమిషనర్ వరంగల్)		8712658992
అసిస్టెంట్ కమిషనర్(ఎన్‌ఫోర్స్‌మెంట్) వరంగల్		8712658993
ఎక్సైజ్ సూపరింటెండెంట్లు(జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి)		
డీపీఈవో	వరంగల్ రూరల్	8712658994
డీపీఈవో	వరంగల్ అర్బన్	8712658995
డీపీఈవో	జనగామ	8712658996
డీపీఈవో	జయశంకర్ భూపాలపల్లి	8712658997
డీపీఈవో	మహబూబాబాద్	8712658998
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ..		
ఏఈఎస్(ఎన్‌ఫోర్స్‌మెంట్) వరంగల్		8712658999
ఏఈఎస్	వరంగల్ రూరల్	8712659001
ఏఈఎస్	జనగామ	8712659002
ఏఈఎస్	జయశంకర్ భూపాలపల్లి	8712659003
ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు..		
పీ అండ్ ఈఐ(ఎన్‌ఫోర్స్‌మెంట్)	వరంగల్	8712659004
పీ అండ్‌ఈఐ(ఎన్‌ఫోర్స్‌మెంట్)	వరంగల్	8712659005
టాస్క్‌ఫోర్స్ సీఐలు..		
డీటీఎఫ్	వరంగల్ అర్బన్	8712659023
డీటీఎఫ్	వరంగల్ రూరల్	8712659024
డీటీఎఫ్	జయశంకర్ భూపాలపల్లి	8712652025
డీటీఎఫ్	మహబూబాబాద్	8712659026
డీటీఎఫ్	జనగామ	8712659027

ఉమ్మడి వరంగల్ జిల్లా సీఐలు..		
ఎస్‌హెచ్‌వో	ఘన్‌పూర్	8712659006
ఎస్‌హెచ్‌వో	జనగామ	8712659007
ఎస్‌హెచ్‌వో	పాలకుర్తి	8712659008
ఎస్‌హెచ్‌వో	భూపాలపల్లి	8712659009
ఎస్‌హెచ్‌వో	ఏటూరునాగారం	8712659010
ఎస్‌హెచ్‌వో	కాటారం	8712659011
ఎస్‌హెచ్‌వో	ములుగు	8712659012
ఎస్‌హెచ్‌వో	గూడూరు	8712659013
ఎస్‌హెచ్‌వో	మహబూబాబాద్	8712659014
ఎస్‌హెచ్‌వో	తొర్రూరు	8712659015
ఎస్‌హెచ్‌వో	నర్సంపేట	8712659016
ఎస్‌హెచ్‌వో	పరకాల	8712659017
ఎస్‌హెచ్‌వో	వర్ధన్నపేట	8712659018
ఎస్‌హెచ్‌వో	హనుమకొండ	8712659019
ఎస్‌హెచ్‌వో	కాజీపేట	8712659020
ఎస్‌హెచ్‌వో	ఖిలా వరంగల్	8712659021
ఎస్‌హెచ్‌వో	వరంగల్ అర్బన్	8712659022
లిక్కర్ డిపో సీఐలు..		
డిపో సీఐ డిపో-1 వరంగల్ అర్బన్		8712659028
డిపో సీఐ డిపో -2 వరంగల్ అర్బన్		8712659029
స్టాఫ్ ఆఫీసర్(ఎస్‌వో) వరంగల్		8712659030

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE
■హన్మకొండ సప్తగిరి కాలనీలో 150 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ గల ప్లాటు అమ్మకానికి కలదు. (నోబ్రోకర్స్) సంప్ర॥ సెల్: 9441001574. [W-189157]

HOUSE FOR SALE
■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళే 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27212]

FLATS FOR SALE
■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27215]

HOUSE FOR SALE/RENT
■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

SERVICES
■సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]

BUSINESS OFFER
■Sipra కంపెనీ ప్రైవేట్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED
■WGL, మండిబజార్ Exclusive డ్రైఫ్రూట్ షాప్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సాలరీ: 10000-12000. సెల్: 9177395934. [WA-602]

WANTED TEACHERS
■Wanted Hindi and supporting Lady Teachers for 1st to 5th Classes Indian Kids High School, SVN Road, Warangal. Cont No: 9963006221. [W-189143]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'చల్లా' మాకొద్దు..'నాగుర్ల'కే మద్దతు

- తెలంగాణ ఉద్యమకారుల స్పష్టీకరణ
- ధర్మారెడ్డి టికెట్ రద్దు చేయాలి
- పరకాలలో సమావేశం


మాట్లాడుదుతున్న రాజేశం

పరకాల: సీఎం కేసీఆర్.. బీఆర్‌ఎస్ పరకాల అసెంబ్లీ అభ్యర్థిగా చల్లా ధర్మారెడ్డిని ప్రకటించారు. అయితే ఈ నిర్ణయాన్ని నాగుర్ల వెంకటేశ్వర్లు వర్గంతో పాటు తెలంగాణ ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఒంటెద్దు పోకడలతో వెళ్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తమ తడఖా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు. చల్లా ధర్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ పరకాలలోని స్వర్ణగార్డెన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ, వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు హింగే శివాజీ, ఇంగ్లే శివాజీ, తెలంగాణ ఉద్యమకారుడు (బీఆర్‌ఎస్ బహిష్కృతనేత) గజ్జి విష్ణువర్ధన్‌తో పాటు తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, వ్యాపారులు, ఆరెకులస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గజ్జి విష్ణు మాట్లాడుతూ 15 సంవత్సరాలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనను వివిధ కేసులతో వేధిస్తున్నారన్నారు. టికెట్ రాకముందు..టికెట్ వచ్చిన తర్వాత కూడా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. కేవలం తన ఆస్తులను రూ.200 కోట్లకు, 2వేల ఎకరాలకు పెంచుకున్నారన్నారు. అలాంటి ఎమ్మెల్యేకు మళ్లీ టికెట్ ఇచ్చారని, ఇప్పటికైనా అధిష్టానం తన నిర్ణయం మార్చుకోవాలని, లేని పక్షంలో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బహుజన బిడ్డ నాగుర్ల వెంకటేశ్వర్లుకు టికెట్ ఇస్తేనే పరకాలలో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. సందెల సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఏ కులం, వర్గం మద్దతు తెలపడం లేదన్నారు. ఆరెసంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ ఉద్యమకారుడు నాగుర్లకు టికెట్ ఇవ్వకపోవడంపై ప్రజలు ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో గుండెకారి రంగారావు, నాగుర్ల శంకర్‌రావు, వంచనగిరి వీరేశం, గుర్రం రఘు, బాబుమీయా, మోతె చిరంజీవి, హెండిగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గంటల ప్రభుత్వమా.. | మూడు పంటల ప్రభుత్వమా?

- ఏది కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలి
- ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ కావాలా....మూడు పంటలు పండించేందుకు నిరంతర విద్యుత్ ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలగిరిలో రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. మూడు గంటల విద్యుత్ చాలు అని రైతులను అవమానించిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అన్ని రకాల పంటలు పండించి నష్టపోయామని..ఇకనైనా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి అధిక లాభాలు సాధించాలని సూచించారు. ఎంపీ దయాకర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏకైక ఆయిల్‌పామ్ పరిశ్రమ తొర్రూరులో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లా వాసుల సౌకర్యార్థం మంత్రి దయాకర్‌రావు ఆయిల్ ఫామ్ పరిశ్రమ ఇక్కడికి తీసుకురావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో 7 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, జీఎం సుధాకర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ బాలాజీనాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ రాములు పాల్గొన్నారు.

గోపాలగిరిలో రైతుల నిరసన

ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుతో తమ భూములు కోల్పోతున్నామని పేర్కొంటూ ఆ గ్రామ రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధుల వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయకుండా ఎలా శంకుస్థాపన చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు 16మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, భూములు కోల్పోయిన రైతులకు పట్టాలు లేవని, అయినప్పటికీ మానవతా దృక్పథంతో ప్రభుత్వం వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు, స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని మంత్రి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

రక్తపు మరకల కలకలం..

- భయాందోళనలో రజాలీపేట గ్రామస్తులు
- పోలీసులకు ఫిర్యాదు..


రక్తపు మరకలను పరిశీలిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రజాలీపేట గ్రామంలో రక్తపు మరకలు మంగళవారం కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన పోతరాజు వీరభద్రం, పోతరాజు రామతార, నల్లపు ఉపేందర్, నీలం రమాదేవి, దొంగరి వీరయ్య ఇళ్ల ఆవరణాల్లో మూడు రోజుల నుంచి రక్తపు మరకలు కనిపిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి దుండగులు గ్రామంలోని పలువురి ఇళ్ల ఎదుట, డాబాలు, గడపలపై రక్తం చల్లుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం లేచి తలుపులు తీసి చూసే సరికి ఇండ్ల ఎదుట రక్తం ఉండడంతో భయాందోళనకు గురవుతున్నామని, తమను కూడా చంపుతారనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమాచారం తెలుసుకున్న కురవి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సమగ్ర విచారణ జరిపి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. కాగా, ఎవరైనా క్షుద్ర పూజలు చేస్తూ రక్తాన్ని ఇళ్ల ఎదుట, ఇళ్ల పైకప్పుల మీద చల్లుతున్నారో తెలియడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

కత్తితో నరికి..చెరువులో పడేసి..

- శివునిపల్లిలో వ్యక్తి దారుణ హత్య
- ఆలస్యంగా వెలుగులోకి..


కరుణాకర్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లికి చెందిన తీగల కరుణాకర్(35) దారుణహత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన చిక్కుడు నాగరాజు.. కరుణాకర్‌ను కత్తితో దారుణంగా చంపి శివునిపల్లి శివారు నమిలిగొండ చెరువులో పడేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు కథనం ప్రకారం శివునిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తీగల యోబు, మరియ దంపతుల రెండో కుమారుడు కరుణాకర్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అదేవిధంగా శివునిపల్లికి చెందిన చిక్కుడు నాగరాజు హమాలీ పనిచేస్తుంటాడు. నమిలిగొండ శివారులో వారివురి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. ఈ క్రమంలో కరుణాకర్‌కు, నాగరాజు భార్యకు మధ్య పరిచయం ఏర్పడింది. ఈనెల 25న హైదరాబాద్‌లో ఉన్న కరుణాకర్.. నాగరాజు భార్య ఫోన్‌కు ఫోన్ చేయగా ఇంట్లో ఉన్న ఆయన ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఇదీ గమనించని కరుణాకర్ తాను సాయంత్రం వస్తున్నానని, కలుస్తామని చెప్పగా నాగరాజు కోపంతో రగిలిపోయాడు. ఈ విషయంపై ఏమి తెలియనట్లు బయటకు వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఆమెకు మరోసారి ఫోన్ రావడంతో తమ వ్యవసాయ భూముల సమీపంలో ఉన్న మామిడితోట వద్దకు వెళ్లింది. గమనించిన నాగరాజు కత్తి తీసుకుని మామిడితోటకు వెళ్లాడు. అక్కడ తన భార్యతో కరుణాకర్ మాట్లాడుతున్న విషయం గుర్తించి ఒక్కసారిగా కత్తితో దాడి చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని కచ్చువల, సంచిలో కట్టి నమిలిగొండ చెరువులో పడేసి వెళ్లాడు. ఈనెల 25వ తేదీ రాత్రి నుంచి కరుణాకర్ కనిపించకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. అతడి ఆచూకీ కోసం పోలీసులను కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో నిందితుడు స్వయంగా మంగళవారం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. దీంతో విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డి.. చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. దీంతో మృతుడి భార్య, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. కాగా, హత్య ఒక్కరే చేశారా.. మరెవరైనా ఉన్నారా? హత్యకు వివాహేతర సంబంధమే కారణమా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే పోలీసులు కోణాల్లో విచారణ చేస్తున్నారు.